పట్టాలు ఇప్పించండి మహాప్రభో!

● బుడమేరు బంజరు భూముల రైతుల వేడుకోలు ● పట్టాలు లేకపోవడంతో దక్కని నష్టపరిహారం

గుడివాడరూరల్: బుడమేరు పరివాహక ప్రాంతంలోని బంజరు భూముల రైతులకు పట్టాలు ఇప్పించాలంటూ దశాబ్దాల కాలంగా వేడుకుంటున్నారు. నందివాడ మండలంలోని చేదుర్తిపాడు, ఒద్దులమెరక, పుట్టగుంట, అరిపిరాల, రామాపురం, కుదరవల్లి, ఇలపర్రు గ్రామాల పరిధిలోని బుడమేరు డ్రెయిన్‌లో దాదాపుగా 1,000 ఎకరాల వరకు పోరంబోకు బంజరు భూమి ఉంది. ఆయా గ్రామాల పరిధిలోని పేద బడుగు, బలహీన వర్గాల రైతులు వంశపారపర్యంగా భూములను సాగు చేసుకుంటున్నారు.

ముంపులతోనే సాగు

బుడమేరు పరివాహక ప్రాంతం కావడంతో తరచూ వరదలు వచ్చిన సమయంలో భూములు ముంపునకు గురి కావడంతో రైతన్నలు ఎక్కువగా రబీ సీజన్‌లోనే పంటలు సాగు చేస్తూ వస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సాగు చేసినా వర్షాకాలం కావడంతో చిన్నపాటి వర్షాలకు పంట భూములు ముంపునకు గురై పంట చేతికి అందని దుస్థితి నెలకొంది. ఇటీవల సంభవించిన బుడమేరు వరద రైతుల కంట కన్నీరే మిగిల్చింది. రైతులు ఆరుగాలం శ్రమించి ఎకరాకు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట వరద దాటికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒక్క గింజ చేతికి వచ్చిన పాపాన పోలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా వచ్చిన తుపాను రైతులను అప్పులు పాలు చేసింది. ముఖ్యంగా ఇలపర్రు రెవెన్యూ పరిధిలో సుమారుగా 500 ఎకరాలకు పైగా బంజరు భూమి సాగవుతుంది. ఈ భూముల్లో వేసిన పంట పూర్తిగా నాశనం కావడంతో రైతులు నట్టేటముని గారు.


వరదలకు నీటమునిగిన బుడమేరు పరివాహక బంజర భూములు (ఫైల్)

దక్కని పరిహారం

బంజరు భూముల్లో సాగు చేసిన రైతులకు నష్ట పరిహారం అందించలేదు. ఇదే పరివాహక ప్రాంతంలో ఎగువన విజయవాడ నుంచి బాపులపాడు మండలం వరకు పట్టాలు ఉన్న భూములు ముంపునకు గురయ్యాయని, ఎకరాకు రూ.10 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించారు. బంజరు భూముల రైతులకు పట్టాలు లేవన్న సాకుతో నష్టపరిహారం చెల్లించలేదు. వాస్తవానికి 1950కు ముందు ఇదే ప్రాంతంలో బుడమేరు కరకట్టలు నిర్మించకముందు భూములను పంట భూములుగా పరిగణించి వరదలు వచ్చిన సమయంలో నష్టపరిహారం చెల్లించారు. జలగం వెంగళ్రావు సీఎంగా ఉన్న సమయంలో బుడమేరు ఇరువైపులా కరకట్టలు నిర్మించారు. అప్పటి నుంచి కాల్వల పరిధిలో ఉన్న భూములకు నష్టపరిహారం చెల్లించేది లేదని సుప్రీంకోర్టు తీర్పును వంకగా చూపి భూములకు పట్టాలు ఇవ్వలేదు. పంట నష్టపోయినా పరిహారం చెల్లించకుండా అధికారులు పట్టాలు లేవనే సాకు చూపుతున్నారు. ఫలితంగా రైతులు నష్టపోతూ వస్తున్నారు. ప్రతి ఏడాదీ సాగు చేస్తున్న భూములకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు చేస్తున్నా పంట నష్టపోతే అధికారులు పరిహారం ఇవ్వడం లేదు.


బుడమేరు పంట భూములకు పరిహారం ఇవ్వాలంటూ వామపక్ష రైతు సంఘ నాయకుల ఆందోళన (ఫైల్)

ఆధునికీకరణలో భూములు కోల్పోయిన రైతులు

బుడమేరు ఆధునికీకరణ పేరిట విజయవాడ నుంచి ఇలపర్రు వరకు ఐదు రీచ్‌లుగా డ్రెయిన్లు విభజించి కాలువను తవ్వారు. ఆధునికీకరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం రూపంలో ప్రభుత్వం భారీగానే నిధులు మంజూరు చేసింది. ప్రాంతాలను బట్టి పట్టాలు ఉండి భూములు కోల్పోయిన రైతులకు లక్షల్లో పరిహారం చెల్లించింది. నందివాడ మండలంలోని బంజరు భూముల రైతుల భూములు దాదాపుగా 100 ఎకరాలకు పైగా ఆధునికీకరణలో కోల్పోయారు. పట్టాలు లేకపోవడంతో రైతులకు ఒక్క రూపాయి నష్టపరిహారం చెల్లించలేదు. దశాబ్దాల కాలంగా పండించుకున్న పంట భూములకు పట్టాలు ఇప్పించాలని బంజరు భూముల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై సీఎం చంద్రబాబునాయుడు స్పందించి బంజరు భూముల రైతులకు న్యాయం చేయాలని అన్నదాతలు మొరపెట్టుకుంటున్నారు.

కండీషన్ పట్టాలు ఇవ్వండి



బుడమేరు పరివాహక ప్రాంతంలో బంజరు భూముల రైతులకు అన్యాయం జరుగుతోంది. కాల్వల్లో ఉన్న భూములకు పట్టాలు, పరిహారం ఇవ్వకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఉందంటూ అధికారులు సాకు చూపి రైతులకు న్యాయం చేయడం లేదు. ఇదే డ్రెయిన్‌లో భూములకు పట్టాలు ఇచ్చిన ప్రభుత్వాలు, అధికారులు బంజరు భూములకు ఎందుకు పట్టాలు ఇవ్వడం లేదు. కనీసం కండీషన్ పట్టాలు ఇచ్చి రైతులకు న్యాయం చేయాలి.

– నీలం మురళీకృష్ణారెడ్డి, రైతు సంఘం నాయకుడు

తీవ్రంగా నష్టపోతున్నాం



బుడమేరులో మా తాతలు, తండ్రి నుంచి భూమి ఉంది. ఏటా సాగు చేస్తున్నాం. వరదలు వచ్చినప్పుడు పంట పూర్తిగా నీట మునిగి నష్టపోతున్నాం. పట్టాలు లేని కారణంగా మాకు నష్టపరిహారం ఇవ్వడం లేదు. పట్టాలు ఇవ్వాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను వేడుకుంటూనే ఉన్నాం. మా గోడు విన్న నాయకుడే లేడు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మాపై కరుణించి పట్టాలు ఇప్పించి పుణ్యం కట్టుకోండి.

– ఎం.గాంధీ, రైతు, ఎల్ఎల్ పురం

రైతులు, కార్మికులకు మేలు జరగాలి

గుడివాడ టౌన్: నూతన సంవత్సరంలో రైతులు, కార్మికులకు మేలు జరిగితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఆటోనగర్‌లోని శ్రీ శ్రీనివాసా ఆటో ఇంజినీరింగ్ వర్క్స్‌లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కార్మికులు, కర్షకులు ఆర్థికంగా బలపడినపుడే దాని ఫలితాలు కనిపిస్తాయన్నారు. అనంతరం శ్రీనివాస ఇండస్ట్రీస్ డైరెక్టర్ నుగలాపు సురేష్‌బాబు, నుగలాపు సేవా సమితి సభ్యులు, కార్మికులు నుగలాపు వెంకటేశ్వరరావును సత్కరించారు.

నగర సంకీర్తన

మండవల్లి: మండవల్లిలో కొలువైన శ్రీదత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం భక్తులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వెళ్లి భిక్ష స్వీకరించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయం, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం తదితర ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. గుడివాడ చిట్టిబాబు, బందారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

కళ కళలాడిన చర్చిలు

మండవల్లి: నూతన సంవత్సరం జనవరి ఒకటో తేదీ సందర్భంగా బుధవారం చర్చిలన్నీ కళకళలాడాయి. తెల్లవారు జామునుంచి ఆయా చర్చిల్లో ఫాదర్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, భైరవపట్నం, అప్పాపురం, అల్లినగరం తదితర గ్రామాల్లోని చర్చిలన్నీ రంగులతో తీర్చిదిద్దారు. మండవల్లి హోలీ ఆర్మీ ఫెలో షిప్ చర్చిలో నిర్వాహకురాలు రాణి అబ్రహాం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముదరబోయిన వెంకటేశ్వరరావు, సుబ్బారావు, బి.పాల్ అబ్రహాం, ఐజక్ అబ్రహాం పాల్గొన్నారు.

క్లుప్తంగా

శేష వాహనంపై దర్శనమిచ్చిన వెంకన్న



గుడ్లవల్లేరు: నూతన సంవత్సర దినోత్సవాన్ని పురస్కరించుకుని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి లయంలో బుధవారం స్వామి శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చి నమిచ్చారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

రూ.19.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

గుడ్లవల్లేరు: వేమవరంలో రూ.19.20 లక్షలతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఈ రోడ్డు పనులను పూర్తి చేశారు. జాతీయ ఉపాధి హామీ నిధుల కింద ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు నాగేశ్వరరావు పేర్కొన్నారు.

నవనీత వేణుగోపాలుడిగా దర్శనం



గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులకు నవనీత వేణుగోపాలుడిగా దర్శనమిచ్చారు. స్వామికి ఆలయ పండితుడు డాక్టర్ అగ్నిహోత్రం ఫణిగోపాల్ ప్రత్యేక పూజలను చేపట్టారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్టేడియం క్రీడాకారుల ప్రతిభ



గుడివాడ టౌన్: రాష్ట్ర స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో తమ క్రీడాకారులు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక స్టేడియం కార్యాలయంలో క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ పోటీలో తమ క్రీడాకారుడు కాశీచరణ్ రుత్విక్ 66 కిలోల విభాగంలో 265 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, నల్లగొండ లీలా అజయ్ 53 కిలోల విభాగంలో 285 కిలోలు బరువును ఎత్తి వెండి పతకం సాధించారన్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్ పాల్గొన్నారు.

చర్చిలకు కేకుల అందజేత



గుడ్లవల్లేరు: నూతన సంవత్సర సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు ఈడె వెంకట ప్రసాద్ ఆర్థిక సాయంతో కొతవరంలోని చర్చిలకు కేకులను అందించారు. వైఎస్సార్ సీపీ గుడ్లవల్లేరు మండల అధ్యక్షురాలు పడమటి సుజాత చేతుల మీదుగా బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కోటప్రోలు నాగు, వైఎస్సార్ సీపీ నాయకులు రేమల్లి ప్రసాద్, సన్నీ, రామారావు, కొడాలి కొండ, రాజేష్, వెంకటేష్, అజయ్, శివ, శ్రీను, సాయి కిరణ్, పండు, వినోద్, మూర్తి పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

గుడ్లవల్లేరు: మండలంలో నిర్వహించే కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ హెచ్చరించారు. వడ్లమన్నాడు మురుగు కాల్వ డొంకలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై దాడి చేసేందుకు బుధవారం ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లారు. పోలీసులు వచ్చేసరికే పందెపు రాయుళ్లు తమ కోళ్లతో ఆ ప్రాంతం నుంచి పరారయ్యారు. ఎస్ఐతోపాటు ఏఎస్ఐ మెండు సాంబశివరావు, అమలేశ్వరరావు, వీరబాబు, శివమణి ఉన్నారు.

సిమెంటు రోడ్లు పూర్తి

నందివాడ: మండలంలోని కుదరవల్లిలో నూరుశాతం సిమెంటు రోడ్లు పూర్తిచేశామని మాజీ సర్పంచ్ మసిముక్కు వేణు తెలిపారు. కుదరవల్లి గ్రామానికి అడిగిన వెంటనే నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి


పామర్రులో కేకను కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్


పామర్రులో సీడీపీఓ భానుశ్రీ తదితరుల మధ్య కేకను కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా


కైకలూరు వేడుకల్లో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్


వరహాపట్నంలో ఎమ్మెల్యే కామినేనికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


తోట్లవల్లూరులో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి


గుడివాడలో నూతన సంవత్సర కేకను కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాము

పామర్రు: నియోజకవర్గంలోని ప్రజలందరూ 2025 సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక కార్యాలయం వద్ద నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు అభిమానుల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. అందరి మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ పేదల పక్షాన ఉంటూ పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంపీపీలు దాసరి అశోక్‌కుమార్, గోగం సురేష్, కుండేటి ఇందిర, కాసాని వేద సుప్రజ, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఉప సర్పంచ్ బాల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులుశ్రీనివాసరావు, రత్నకుమారి, నాగమల్లేశ్వరరావు, మహేష్, నాయకులు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వార్డు మెంబర్లు శ్రీహరి, వెంకటేశ్వరరెడ్డి, కో–ఆప్షన్‌సభ్యుడు హస్మతుల్లా పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు.

టీడీపీ కార్యాలయంలో..

పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ భానుశ్రీ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ సుభాకర్, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఎమ్మెల్యేను అభినందించారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ, సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. కొత్త సంవత్సరం రాకను పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి బుధవారం కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు శివారెడ్డి, వెంకటేశ్వరరావు, నాయకులు శ్రీనివాసరావు, పీఎస్ కోటేశ్వరరావు, రాజా, రూబెన్,లతీఫ్ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)కు పార్టీ కార్యాలయం వద్ద పలువురు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు, కుటుంబ సభ్యుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. వరహాపట్నం ఇంటి వద్ద ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు నియోజకవర్గంలో కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఇంటి వద్ద న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావును బృందావనం కాలనీలో ఇంటి వద్ద పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అడవి కృష్ణకు ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పారు. గుడివాడ రోడ్డులో రాష్ట్ర బీసీ సంఘ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావుకు ఆయన అభిమానులు కొత్త శుభాకాంక్షలు తెలిపారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: స్థానిక టీడీపీ కార్యాలయంలోని ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రామును నూతన సంవత్సరం సందర్భంగా కూటమి నాయకులు, పలువురు అధికారులు బుధవారం కలసి బొకెలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత గుడ్లవల్లేరు మండల టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన 100కేజీల కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. కూటమి నాయకుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు దావులూరి సురేంద్రబాబు, దింట్యాల రాంబాబు, వాసే మురళీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పోలీసులు

నూతన సంవత్సరంగా సందర్భంగా ఎమ్మెల్యే రామును నియోజకవర్గంలోని పోలీస్ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విజన్ లైఫ్ సెంటర్‌లో..

పామర్రు: స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్‌సెంటర్‌లో బుధవారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం లైఫ్ సెంటర్ అధ్యక్షుడిగా ఉంటూ సేవా కార్యక్రమాలతో పాటు పాస్టర్ల సమస్యలను పరిష్కరించడంలో కీలకపాత్ర పోషిస్తున్న సాల్మన్ కొల్లాబత్తులను సభ్యులు సన్మానించారు.

సంక్షిప్తం

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

తోట్లవల్లూరు: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకుడు విజయకుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో బుధవారం గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరి దుర్గా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు

గుడ్లవల్లేరు: నూతన సంవత్సరంలో మండలంలోని ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ ఆకాంక్షించారు. న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుని గుడ్లవల్లేరు సెంటర్‌లో ఆయన బుధవారం కేక్‌ను కట్ చేశారు.

అభయాంజనేయస్వామికి వడమాల పూజ

పెదముత్తేవి(మొవ్వ): ధనుర్మాస వేడుకల్లో భాగంగా బుధవారం పెదముత్తేవిలోని శ్రీ కృష్ణాశ్రమంలోని అభయ వీరాంజనేయ స్వామికి వడమాలలు సమర్పించారు. అలాగే పుష్పవాదాల సమర్పణ అనంతరం హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. తొలుత స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మముక్షుజన పీఠాధిపతులు ముత్తేవి గౌరకృష్ణ పర్యవేక్షణలో ఆశ్రమవాసులు నిర్వహించారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి

గుడివాడ టౌన్: కృష్ణా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎస్ఐఎస్ఎఫ్–2025 విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లు పూర్తయినట్లు డీవీజే రామారావు తెలిపారు. బుధవారం స్థానిక బైపాస్ రోడ్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో నిర్వహణ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీవైఈఓలు ఐనంపూడి పద్మరాణి, బీఎస్ఎస్ సింగ్, ఎంఈఓలు ఐ. విజయ్, డి. బాలాజీ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

గుడ్లవల్లేరు: స్థానిక నెహ్రూనగర్ బాప్టిస్టు చర్చిలో నూతన సంవత్సర సందర్భంగా బుధవారం ప్రత్యేక ప్రార్థనలను పాస్టర్ జంగం సుధీర్‌కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో బాప్టిస్టు సంఘ కార్యవర్గం వీరాబత్తిన గాబ్రియేలు, దాసి లక్ష్మణరావు, పట్టెం రాజు, దోమతోటి గోపి, పాతపాటి రత్నాకరరావు, కొనాల సామ్యేలు, బొడ్డు కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మండవల్లి: మండలంలోని సింగనపూడిలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమై బాధితుడు కట్టు బట్టలతో మిగిలాడు. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన అమృతలూరి వీరభద్రరావు వడ్రంగి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వీరభద్ర ఇంట్లో ఉండగా మీటరు దగ్గర నుంచి పెద్దగా శబ్దాలు వస్తూ మంటలు వ్యాపించి క్షణాల్లో ఇల్లు కాలిపోయింది. వడ్రంగి పనులు నిర్వహించే సామగ్రి, టేకు, కలపతో పాటు బీరువాలోని రూ.50 వేలు నగదు, ఇంటిలో సామాను కాలి బూడిదయ్యాని బాధితుడు వాపోయాడు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పామర్రు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే సౌజన్యంతో రూపొందించిన ఈ క్యాలెండర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానుల నడుమ ఆవిష్కరించారు.

గుడివాడలో..



గుడివాడ టౌన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం–2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ బుధవారం జరిగింది. ఆ పార్టీ మండల కార్యదర్శి ఆర్ సీపీ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు



కైకలూరు: నూతన సంవత్సరాన్ని ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రజలు బుధవారం జరుపుకున్నారు. పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ మంగళవారం రాత్రి రహదారులలో యువత చిందులు తొక్కారు. రాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఒకరి నొకరు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రధానంగా పలు కూడళ్లలో మహిళలు కొత్త ఏడాదిని ఆహ్వానిస్తూ వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి.

సకల సౌభాగ్యాలతో తులతూగాలి

గుడ్లవల్లేరు: నూతన సంవత్సరంలో ఉమ్మడి జిల్లా ప్రజలంతా సకల సిరులు, సకల సౌభాగ్యాలతో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము కోరారు. బుధవారం ఉప్పాల దంపతుల చేతుల మీదుగా న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేశారు. హారిక, రాముకు గుడ్లవల్లేరు ఎంపీపీ కొడాలి సురేష్, రైతు క్లబ్ కన్వీనర్ పెన్నేరు ప్రభాకరరావు తదితరులు పుష్ప గుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుతో పాటు గుడ్లవల్లేరు సంత కమిటీ చైర్మన్ వల్లభనేని వెంకట సుబ్బారావు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు కలెక్టర్ రాక

కైకలూరు: ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీ కైకలూరు తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం నిర్వహించే పలు శాఖల సమీక్ష సమావేశానికి విచ్చేస్తున్నారని ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం బుధవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హాజరవుతారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

టిడ్కో గృహాలకు రుణమాఫీ చేయాలని వినతి

గుడివాడరూరల్: టిడ్కో గృహాలకు సంబంధించి రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు ఆ కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ బుధవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే గృహంలో ఎమ్మెల్యేను టిడ్కో వాసులు కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబుతో మాట్లాడి టిడ్కో గృహాల విషయంలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు చెప్పారు. బ్యాంక్ అధికారులు పెడుతున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యేకు వివరించామన్నారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ నూరున్నీసా, కమిటీ సభ్యులు వి.రంగారావు, రాయల గణేష్, సింగవరపు రాంబాబు పాల్గొన్నారు.